క్లుప్తంగా

వరద బాధితులకు రూ.1.10 లక్షలు



ఐఎంఏ సభ్యులు పంపిన చెక్కు

హిందూపురం అర్బన్: విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు హిందూపురం (ఐఎంఏ) ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు రూ.1,10,000 విరాళం అందించి నట్లు హిందూపురం ఐఎంఏ అధ్యక్షుడు నరసింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుప్రవీణ్ తెలిపారు. ఏపీ తుపాను సహాయ నిధికి ఆ మొత్తాన్ని పంపినట్లు వెల్లడించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలు చేశారు.

విద్యుత్ కార్మికుడికి గాయాలు

రొద్దం: మండల కేంద్రంలో చెట్టు మీద నుంచి జారిపడి విద్యుత్ కార్మికుడు రామప్ప స్వల్పంగా గాయపడ్డాడు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ వైర్లకు చెట్టు కొమ్మలు తాకుతుండంతో వాటిని తప్పిస్తుండగా చెట్టుపై నుంచి కాలు జాకి కింద పడినట్లు ట్రాన్స్‌కో ఇబ్బంది తెలిపారు. రామప్పకు స్వల్పంగా గాయాలైనట్లు వివరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

గుడిబండ: మండల కేంద్రంలోని సీసీ గిరి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ డీఎల్ యంజారేగౌడు పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య పనులను నిర్వహించారు. మురికి కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని తొలగించే పనులను చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీధులు, రహదారులు ఇరువైపుల ఉన్న చెత్తను శుభ్రం చేసి ట్రాక్టర్ సహాయంతో దూర ప్రాంతాలకు తరలించారు.


మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అదేవిధంగా పారిశుధ్యం పనులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం గణేష్ ఉత్సవాలను గ్రామాల్లో నిర్వహిస్తుంటారని, వీధులన్నీ శుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి వీధిలోనూ వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా అంధకారం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీకి వచ్చిన నిధులు, వాటి ఖర్చులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



మట్టి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులు

హిందూపురం టౌన్: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను మాత్రమే పూజిద్దామని పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులు మట్టి వినాయకులను స్వయంగా సిద్ధం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత , కరస్పాండెంట్ నందకుమార్, హెచ్ఎం గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హిందూపురంలో వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



హిందూపురం: మార్కెట్‌లో జోరుగా సాగుతున్న పూలవిక్రయాలు



అమరాపురం:ఆటోలో గణేష్ విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

వినాయక చవితి సందడి

- కిటకిటలాడిన మార్కెట్లు
- విద్యుత్ అలంకరణలతో మంటపాల ముస్తాబు
- నేటి నుంచి ఉత్సవాలు

సాక్షిబృందం: వినాయక చవితి నేపథ్యంలో శుక్రవారం హిందూపురం, పెనుకొండ, మడకశిరలోని మార్కెట్లు, ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. గణపయ్యల ప్రతిమల నుంచి పండ్లు, పూలతో పాటు మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక మంటపాలను ప్రత్యేకంగా అలంకరించారు. ట్రాక్టర్లు, లారీల ద్వారా భారీ గణేష్ విగ్రహాలను తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం నుంచే అన్ని చోట్లా గణనాథులు ప్రత్యేక పూజలు అందుకోన్నాడు.



హిందూపురం మెయిన్ బజారులో కొనుగోలుకు ఉంచిన వివిధ ఆకారాల్లోని బొజ్జ గణపతి



సత్యనారాయణపేటలోని సురేఖ ఇంట్లో వినాయక చరిత్ర తెలిపేలా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



మడకశిర పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ



అమరాపురంలోని వినాయకనగర్‌లో గణేష్ మంటపం వద్ద విద్యుత్ దీపాల అలంకరణ



మడకశిర పట్టణం నుంచి వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం

కళాశాలకు అధ్యాపకుల కరువు

– ఇబ్బందుల్లో విద్యార్థులు

రొళ్ల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఉన్నత పాఠశాలలను ప్లస్‌టు కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగానే రొళ్ల ఉన్నత పాఠశాల కూడా ప్లస్‌టు కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. దీంతో రొళ్ల జెడ్పీహెచ్ఎస్ ప్లస్‌టుగా కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ ఒక్కొక్క కోర్సుకు 40 సీట్లు చొప్పున కేటాయించారు. గ్రామీణా ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు స్థానికంగానే కళాశాల ఏర్పాటు కావడంతో ఎంతో సంతోషపడ్డారు. ఎంపీసీకి ఐదుగురు, బైపీసీకి 15 మంది, సీఈసీకి 8 మంది మొత్తం 28 మంది విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్లస్‌టు కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలను గాలికి వదిలేసింది. కనీసం కళాశాలలో విద్యార్థులు చేరి మూడు నెలలు కావస్తున్న అధ్యాపకులను నియమించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు 2025 మార్చి నెలలోనే ఉన్నాయని, అయితే ఈ కళాశాలలో పాఠాలు కూడా ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంఈఓ శ్రీధర్‌ను 'సాక్షి' వివరణగా అదే పాఠశాలలో పీజీ చేసిన స్కూల్ అసిస్టెంట్లతో విద్యను బోధిస్తున్నామన్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని ప్లస్‌టుగా అప్‌గ్రేడ్ అయిన కళాశాలకు అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



రొళ్లలో ప్లస్‌టు కళాశాలగా మారిన జెడ్పీహెచ్ఎస్

గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

గుడిబండ: గణేష్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మంటపాల నిర్వాహకులకు మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మంటపాల నిర్వాహకులతో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు. వినాయక విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకూ ప్రజలకు ఇబ్బంది లేకుండా సర్పంచులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు డీఎల్ యంజారేగౌడు, తిప్పేస్వామి, జగదాంబక్రిష్టప్ప, ఎస్ఐ మునిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశం మున్సిపల్ కమిషనర్ రంగస్వామి కూడా పాల్గొన్నారు.

అగళి: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ వీరేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరేష్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలు, పెద్ద స్పీకర్లు ఏర్పాటు చేయకూడదన్నారు.



మాట్లాడుతున్న సీఐ రాజకుమార్

కళాశాల అభివృద్ధికి కృషి చేయండి

హిందూపురం టౌన్: సమన్వయంతో, అంకిత భావంతో పనిచేసి కళాశాల అభివృద్ధికి సిబ్బంది కృషిచేయాలని న్యాక్ పీర్ కమిటీ సభ్యులు సూచించారు. స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా కొనసాగిన న్యాక్ పీర్ టీమ్ సందర్శన శుక్రవారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన ముగింపు సమావేశానికి న్యాక్ పీర్ టీమ్ చైర్మన్, మహారాష్ట్రలోని షోలాపూర్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి మృణాళిని, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల, విద్యార్థినుల అభ్యున్నతికి గత ఐదేళ్ల కాలంలో కళాశాల సిబ్బంది తయారు చేసిన వివిధ రికార్డులు, సిబ్బంది పనితీరు, విద్యార్థినుల ప్రతి స్పందన తదితర అంశాలపై పరిశీలన జరిపిన అంశాలను న్యాక్ ముఖ్య కార్యాలయానికి నివేదిస్తామని న్యాక్ పీర్ కమిటీ చైర్మన్ మృణాళి అన్నారు. వాటి ఆధారంగా కళాశాలకు గ్రేడింగ్ ఇస్తారని వెల్లడించారు. న్యాక్ పీర్ టీమ్ మెంబర్లు కమలాక్షి, యశోధరశర్మ మాట్లాడుతూ అతి తక్కువ ఆవరణలో ఉన్న కళాశాల అద్భుత విజయాలు సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐ.క్యూ.ఏ.సీ. సమన్వయకర్త శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేసులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



న్యాక్ కమిటీ రిపోర్టును కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న దృశ్యం

పెయ్యదూడలు పుట్టేలా గర్భకోశ చికిత్స

- పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్న డీడీ సుధాకర్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో కృత్రిమ గర్భాధారణపై ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డా.సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయనే స్వయంగా రైతులు తీసుకువచ్చిన ఆవులకు కేవలం పెయ్యదూడలను ఇచ్చేలా కృత్రిమ గర్భాధారణ చికిత్స అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ రైతులతో మాట్లాడారు. పాడి రైతులు ఎక్కువగా పెయ్య దూడల వైపు మొగ్గు చూపిస్తున్నారన్నారు. అందుకు కారణం వాటి ద్వారా ఆవుల సంఖ్య ఇంటిలోనే పెంచుకొనే అవకాశం ఉంటుందన్నారు. నూతన ప్రయోగాల ద్వారా కృత్రిమ గర్భాధారణ ద్వారా పెయ్యలు మాత్రమే జన్మించే వీర్యం ఇప్పుడు అందుబాటులో ఉందన్నారు. దీని ధర రూ.1350 కాగా, ప్రభుత్వం 63 శాతం రూ.850 సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతు కేవలం రూ.500 కడితే సరిపోతుందన్నారు. ఒకవేళ ఇవి ఫెయిల్ అయితే ఆ నగదు తిరిగి రైతుకు చెల్లిస్తామన్నారు. పొరపాటున కుర్ర దూడ పుడితే రూ.250 తిరిగి చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జయకుమార్‌రెడ్డి, వీపీ సురేష్ బాబు, ఏహెచ్ఏలు, జీఎంలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చికిత్స శిబిరంలో పాల్గొన్న పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని ఎస్.ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందరెడ్డి (55) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, నాయకులు గోవిందరెడ్డి భౌతికకాయం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



గోవిందరెడ్డి (ఫైల్)

వయనాడ్ బాధితులకు చేయూత



విద్యార్థులకు స్వీట్లు అందిస్తున్న జపానంద స్వామి

పావగడ: కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకు ఇన్ఫోసిస్, దేశ్ పాండె ఫౌండేషన్ల సహకారంతో రెండో విడతగా స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద చేయూత అందించారు. ఈ సందర్భంగా స్వయంగా స్వామిజీ వయనాడ్ వరద బాధితులకు అత్యవసర ఆహార పదార్థాల కిట్లను అందించారు. ముఖ్యంగా వయనాడులోని ముండక్కై, చోరలమర ప్రాంతాలలో సంభవించిన భూకంపం, వరదల ధాటికి పూర్తిగా దెబ్బతిన్న నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు సుమారు రూ 5 లక్షలు విలువ చేసే వంట సామగ్రి, గ్రైండర్లు, మూడు రకాల స్టౌవ్‌లు, బకెట్లు, భారీ పాత్రలు, ఓ ట్రక్ లోడు పదార్థాలు అక్కడి జిల్లా కలెక్టర్ మేఘశ్రీకి అందించారు. అదే విధంగా వంద మంది పోలీసులు, మిలటరీ సైన్యానికి నాణ్యమైన రైన్ కోట్లు, గొడుగులు అందించారు. ఇంకా మూడు, నాల్గవ విడతల పరిహారాన్ని అందిస్తానని స్వామిజీ తెలిపారు.

కంపచెట్లు తొలగించరూ..



ఈచలెడ్డి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఇరుపైపులా పెరిగిన కంప చెట్లు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఈచలెడ్డి నుంచి చీపులేటి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డులో ఒక వైపు నుంచి ట్రాక్టర్ వస్తే మరోవైపు నుంచి వచ్చే ఏ వాహనమైనా సరే వెనుక్కు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. నడిచి వచ్చే వారు, ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు అధికంగా పెరగడంతో సాయంత్రం 6 గంటలైతే ఈ రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో రోజు రోజుకు కంప చెట్లు రోడ్డులోకి వస్తున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కంప చెట్లను తొలగించి ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేట ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ప్లాస్టిక్ కవర్ల నియంత్రణపై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ముప్పుగా మారిందన్నారు. ఒక్కసారి వాడిపడేసిన ప్లాస్టిక్ కవరు భూమిలో కరిగి ఇంకి పోవాలంటే వంద సంవత్సరాలు పైన అవుతుందన్నారు. ప్లాస్టిక్ కరిగే సమయంలో కూడా ప్లాస్టిక్ రేణువులుగా ఏర్పడి విషతుల్యంగా మారుతుందన్నారు. భావితరాలుకు బంగారు భవిష్యత్తు అందించాలంటే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించాలన్నారు. ప్రతి ఒక్కరూ నాణ్యమైన బట్ట బ్యాగులనే వినియోగించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి బట్టల బ్యాగులు పంపిణీ చేశారు.



గోనిపేటలో బట్ట బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మంత్రితో సర్పంచుల భేటీ

పెనుకొండ: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళీశాఖామంత్రి సవితను పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచులు శుక్రవారం కలిశారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో సర్పంచులు భేటీ అయ్యారు. పంచాయతీ నిధులు విడుదల చేయాలని, పంచాయతీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. స్పందించిన మంత్రి నిధుల విడుదలకు తగిన చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు.

ఉషశ్రీచరణ్‌కు స్వాగతం పలికేందుకు తరలిరండి

మడకశిర: 'వైఎస్సార్‌సీపీ నూతన జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదివారం ఉదయం కొడికొండ చెక్‌పోస్టుకు చేరుకుంటారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కొడికొండ చెక్‌పోస్టుకు వరలివచ్చి ఉషశ్రీచరణ్‌కు ఘన స్వాగతం పలకాలి' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పెనుకొండలో జరిగే పార్టీ కార్యక్రమంలో కూడా పాల్గొనాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 75 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం కరణం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



టీచర్ సుజాతను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని వడ్రపాళ్యం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుజాత జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన విషయం తెలిసిందే. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డును కూడా అందుకుంది. ఈ నేపథ్యంలో ఆమెను శుక్రవారం పాఠశాలలో స్థానిక ప్రజలు ఘనంగా సన్మానించారు. సుజాత మాట్లాడుతూ స్థానిక ప్రజల సహకారంతోనే జిల్లా అవార్డు లభించిందన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

డెంగీ బారిన చిన్నారి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వినాయకనగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమార్తె మనిషా (7) డెంగీ బారిన పడింది. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మనిషాకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స ఇప్పించారు. అయితే వైరల్ ఫీవర్ అని చెప్పారు. గురువారం రాత్రి చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో హుటాహుటీన హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. అయితే మండలంలో పదుల సంఖ్యలో డెంగీ జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఉత్సవ విగ్రహం వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు విగ్రహం అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో వెలసిన అన్నమ్మ దేవాలయానికి రూ.2.85 లక్షల విలువ చేసే ఉత్సవ విగ్రహాన్ని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ వితరణ చేశారు. శుక్రవారం బెంగళూరులోని ఆలయ కమిటీ సభ్యులకు ఆయన విగ్రహాన్ని అందజేశారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు



క్రీడా పోటీలకు మైదానాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి పురుష ఉపాధ్యాయులకు ఈ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం స్థానిక యూటీఎఫ్ నాయకులు పర్యవేక్షించారు. క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన విధంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. వివిధ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు మాలింగప్ప, జోగన్న తెలిపారు.